క్లుప్తంగా

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించనున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లోనూ స్పందన ఉంటుందని, స్థానికంగా పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు ఫిర్యాదు చేయవచ్చని ఆమె సూచించారు.

అధ్యాపకురాలు నళినీకి పీహెచ్‌డీ



గుంటూరు ఎడ్యుకేషన్: బోధన సామర్థ్యాలు–ఉపాధ్యాయుల దృక్పథం అనే అంశంపై చేసిన పరిశోధనకు అధ్యాపకురాలు నేరేడుమల్లి నళినికి ఏఎన్‌యూ పీహెచ్‌డీ పట్టా ప్రదానం చేసింది. గుంటూరు నగరానికి చెందిన ఆమె నరసరావుపేట మండలం కేశానుపల్లిలోని డాక్టర్ కేఎస్‌పీఆర్ బీఈడీ కళాశాలలో సాంఘిక శాస్త్ర అధ్యాపకురాలిగా పని చేస్తున్నారు. ఆమె ''టీచింగ్ కాంపిటెన్సీస్ అండ్ టీచర్స్ ఆటిట్యూడ్–ఏ స్టడీ ఎమాంగ్ ప్రాస్పెక్టివ్ టీచర్స్'' అనే అంశంపై తెలంగాణ వర్సిటీ ప్రొఫెసర్ డి. బలరాములు పర్యవేక్షణలో పరిశోధన చేశారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలోని శ్రీ అన్నమయ్య కళావేదికగా ఆదివారం హైదరాబాద్ గంధర్వ నికేతన్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో భక్తి సంగీత విభావరి, శాస్త్రీయ కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కార్యక్రమంలో కృష్ణ చైతన్య వ్యాఖ్యాతగా వ్యవహరించారు. గాయకులు వీణప్రియ, దీప్తిచార్య, నిత్యశ్రీ, ఉషారాజ్, రాధిక, ఎస్.వి.బ్రహ్మాన్ పలు కీర్తనల్ని ఆలపించారు. గాయత్రి కూచిపూడి నృత్యం ఆకట్టుకుంది. అనంతరం కళాకారుల్ని నిర్వాహకులు సత్కరించారు. కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు పి.ఎల్.ఎన్.ఎస్. రామాచారి పర్యవేక్షించారు.

అలరించిన సినీ సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక వ్యవస్థాపకుడు మిరియాల ప్రసాదరావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. గాయకులు టి. సుధీర్, ప్రసాదరావు, శెట్టి థామస్, డి. శ్రీనివాసరావు, పి. హేమంత్, డాక్టర్ సి.వి.ఎస్. రామకృష్ణ, దేవదాసు, సౌజన్య, ఘనశ్యామ్, చింతా రజని సుమధుర గీతాల్ని ఆలపించారు. అనంతరం ప్రముఖ గాయకుడు తొట్టెంపూడి రమేష్‌కు కళా సేవారత్న అవార్డును అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాపునాడు జిల్లా అధ్యక్షుడు మిరియాల గోపీకుమార్, జోన్- 3 అధ్యక్షుడు బి. వెంకటరావు, కళావేదిక చైర్మన్ మిరియాల మురళి, గౌరవాధ్యక్షుడు చందు సాంబశివరావు, అధ్యక్షుడు మేకల రవీంద్ర బాబు, డాక్టర్ జాస్తి వీరాంజనేయులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం



గుంటూరు రూరల్: ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేయటమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ పులగం దివ్య పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, డ్రైయినేజీలు, విద్యుత్ తదితర అభివృద్ధి పనులకు, శ్మశానవాటికల ఆధునీకరణకు నిధులు కేటాయించటం జరిగిందన్నారు. గోర్లవారిపాలెం గ్రామానికి రూ.3 లక్షలు, జొన్నలగడ్డ గ్రామానికి లక్ష రూపాయలు అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శోభారాణి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

సహకారంతోనే స్వచ్ఛ పురస్కార సాకారం

- ఆగస్టు 15 వరకు ప్రజాభిప్రాయ సేకరణ
- సర్వే సేకరణ పనుల్లో సచివాలయ సెక్రటరీలు, వలంటీర్లు, మెప్మా సిబ్బంది
- అక్టోబర్ 2న స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకులు, పురస్కారాల ప్రకటన



ప్రజాభిప్రాయ సేకరణ చేస్తున్న వలంటీర్, సెక్రటరీ

నెహ్రూనగర్: స్వచ్ఛ సర్వేక్షణ్- 2023లో జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడమే లక్ష్యంగా గుంటూరు నగరపాలక సంస్థ ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేపట్టింది. ఇప్పటికే వలంటీర్లు, సచివాలయ సెక్రటరీలు, మెప్మా సిబ్బంది సర్వే చేపట్టారు. ఆగస్టు 15 వరకు నిర్వహించనున్న సర్వేలో నగర ప్రజలు భాగస్వాములు కావాలని నగరపాలక సంస్థ అధికారులు కోరుతున్నారు.

సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు 2,475 మార్కులు

కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ స్వచ్ఛ భారత్ మిషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య మెరుగుకు స్వచ్ఛత పోటీల్ని 2016 నుంచి నిర్వహిస్తోంది. మున్సిపాలిటీల్లో సాధించిన ప్రగతి ఆధారంగా ర్యాంకులు కేటాయిస్తోంది. మొత్తం ఎనిమిది విభాగాలకు 9,500 మార్కులు కేటాయించారు. ఇందులో సర్వీస్ లెవల్ ప్రోగ్రెస్‌కు 4,525, సర్టిఫికేషన్‌కు 2,500, సిటిజన్ ఫీడ్ బ్యాక్‌కు 2,475 మార్కులుగా విభజించారు. త్వరలో కేంద్ర బృందాలు నగరపాలక సంస్థలో పారిశుద్ధ్యం కోసం తీసుకుంటున్న చర్యల్ని ప్రత్యక్షంగా పరిశీలించి ఇచ్చిన నివేదిక ఆధారంగా, అక్టోబర్ 2(గాంధీ జయంతి) రోజున కేంద్ర ప్రభుత్వం స్కోర్ ర్యాంకులు, పురస్కారాల్ని ప్రకటిస్తుంది.

పది అంశాల్లో ప్రశ్నలు

- మీ ఇంటి నుంచి రోజూ చెత్త సేకరిస్తున్నారా?
- మీ ఇంట్లో వ్యర్థాల్ని తడి, పొడిగా వేరు చేస్తున్నారా?
- మీ పరిసరాల్లో కాలువలు శుభ్రంగా ఉన్నాయా?
- మీ నగరంలో రెడ్యూస్, రీయూజ్, రీసైక్లింగ్ గురించి తెలుసా?
- మీ నగరంలో కమ్యూనిటీ, పబ్లిక్ టాయిలెట్లు శుభ్రంగా ఉన్నాయా?
- మీ పరిసరాల్లో పరిశుభ్రతకు మీరు ఎలాంటి రేటింగ్ ఇస్తారు?
- మీ నగరం పరిశుభ్రతకు మీరు ఎలాంటి రేటింగ్ ఇస్తారు?

నమోదు చేయాల్సిన యాప్‌లు

my gov patform, rwacchata app, rr2023 vote for your city app, rr2023 vote for your city web İS ద్వారా ఫోన్‌కి వచ్చే ఓటీపీ ద్వారా ఆన్‌లైన్‌లో సమాధానాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

మెరుగైన ర్యాంకు సాధిస్తే అధిక నిధులు

ప్రతి ఏటా ప్రకటించే ఈ స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకుల్లో మెరుగైన ర్యాంకులు సాధించిన నగరపాలక సంస్థలకు, మున్సిపాలిటీలకు అధికంగా నిధులు మంజూరయ్యే అవకాశం ఉంది. గత ఏడాది గుంటూరు నగరపాలక సంస్థకు 108వ ర్యాంకు వచ్చింది. ఈసారి 220 ఈ ఆటోలు రావడం ద్వారా ఇంటింటి చెత్త సేకరణ మెరుగు పడింది. డంపర్ బిన్ ఫ్రీ సిటీగా గుంటూరు నగరపాలక సంస్థ ఈ సారి 50లోపు ర్యాంకు సాధనే లక్ష్యంగా నగరపాలక సంస్థ అధికారులు కృషి చేస్తున్నారు.

మెరుగైన ర్యాంకు సాధనలో ప్రజలు భాగస్వామ్యం కావాలి

కేంద్ర ప్రభుత్వం ప్రకటించే స్వచ్ఛ సర్వేక్షణ్– 2023లో గుంటూరు నగరానికి మెరుగైన ర్యాంకు సాధన కోసం నగర ప్రజలు సహకరించాలి. సిటిజన్ ఫీడ్ బ్యాక్ కోసం ప్రజలు తమ అభిప్రాయాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. సచివాలయం పరిధిలో వలంటీర్లు, సెక్రటరీలు స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రజలకు అవగాహన కలిపిస్తున్నారు. ఇందులో భాగంగా ఫోన్‌కి వచ్చే ఓటీపీని ఇంటి వద్దకు వచ్చే వలంటీర్లు, సెక్రటరీలకు, మెప్మా సిబ్బందికి తెలియజేసి స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్‌లో గుంటూరుకు మెరుగైన ర్యాంకు వచ్చేందుకు సహకరించాలి. ఓటీపీపై ఎటువంటి అపోహలకు గురికావద్దని ఆమె నగర ప్రజలకు తెలిపారు.

– కీర్తి చేకూరి, నగరపాలక సంస్థ కమిషనర్

మిర్చి యార్డుకు తరలివెళ్లిన వైఎస్సార్ సీపీ నేతలు

భారీ బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ముస్తఫా, నూరి ఫాతిమా తదితరులు

పట్నంబజారు: గుంటూరు మిర్చి యార్డు నూతన పాలకమండలికి తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని పాత గుంటూరు నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. పాత గుంటూరులో ప్రారంభమైన ర్యాలీ బ్రహ్మానందరెడ్డి స్టేడియం, పాత బస్టాండ్, హిమని కూల్‌డ్రింక్ సెంటర్, మార్కెట్, హిందూ కళాశాల కూడలి, నగరం పాలెం మీదుగా మిర్చి యార్డు వరకు కొనసాగింది. స్వయంగా ఎమ్మెల్యే ముస్తఫా ఆయన కుమార్తె, వైఎస్సార్ సీపీ మహిళా నేత షేక్ నూరి ఫాతిమాతో కలసి ద్విచక్ర వాహనాన్ని నడిపి కార్యకర్తలు, యువకుల్లో ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ఆసియాలోనే అతి పెద్దదైన మిర్చి యార్డు గుంటూరులో ఉండటం గర్వకారణమన్నారు. ప్రతిష్టాత్మకమైన యార్డు చైర్మన్ పదవిని బీసీ సామాజికవర్గానికి ఇవ్వడంతో పాటు పాలకమండలిలో సైతం అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ప్రజలు తిరిగి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు, డివిజన్ అధ్యక్షులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

ఏఎస్పీ కె. సుప్రజ



ఆలయాన్ని శుభ్రం చేస్తున ఏఎస్పీ సుప్రజ, గుడిబడి సభ్యులు

పట్నంబజారు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని గుంటూరు జిల్లా అడ్మిన్ అడిషనల్ ఏఎస్పీ కె. సుప్రజ చెప్పారు. ప్రవణ పీఠం ఆధ్వర్యంలో ఆదివారం పాత గుంటూరులో గుడిబడి కార్యక్రమం నిర్వహించారు. దానిలో భాగంగా ప్రవణ పీఠం సభ్యులు ఆలయాన్ని శుభ్రం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏఎస్పీ సుప్రజ ఆలయాన్ని శుభ్రపరిచే కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. ముందుగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించగా, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సుప్రజ మాట్లాడుతూ భక్తిభావం వెల్లివిరిసేలా, ఆలయాల్ని కాపాడుకునేలా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. భక్తులు స్వచ్ఛందంగా వచ్చి ఆలయాల్ని శుభ్రం చేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రవణ పీఠం సభ్యులు, ఆలయ అర్చకుడు రావూరి సుబ్రహ్మణ్య శర్మ పాల్గొన్నారు.

అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండండి !



మాట్లాడుతున్న సీఆర్‌ఏఎఫ్ సమన్వయకర్త సమీర్‌కుమార్. వేదికపై ఏఎస్‌ఐ లక్ష్మి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: అపరిచిత వ్యక్తులతో పరిచయాలకు దూరంగా ఉండాలని మానవ అక్రమ రవాణా నిరోధక విభాగ ఏఎస్‌ఐ లక్ష్మి సూచించారు. రాజాగారితోటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో ఆదివారం ప్రపంచ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా చైల్డ్‌రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ (సీఆర్‌ఏఎఫ్) ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ లక్ష్మి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులతో మాట్లాడటం, స్మార్ట్‌ఫోన్ల ద్వారా సోషల్ మీడియాలో ఫోటోలు, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవడం వల్ల ప్రమాదాల్ని కొనితెచ్చుకోవడమే అవుతుందని తెలిపారు. పలు సందర్భాల్లో అక్రమ రవాణాకు గురయ్యే అవకాశాలున్నాయని హెచ్చరించారు. సీఆర్‌ఏఎఫ్ సమన్వయకర్త కోలా సమీర్‌కుమార్ మాట్లాడుతూ ఎన్‌సీఆర్‌బీ-2021 గణాంకాల ప్రకారం దేశంలో ప్రతి గంటకు తొమ్మిది మంది పిల్లలు అదృశ్యమవుతున్నారని తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ప్యానెల్ న్యాయవాది కట్టా కాళిదాస్ మాట్లాడుతూ పిల్లలకు ప్రాథమిక హక్కులు ఉన్నాయని, వాటితో పాటు విధుల గురించి తప్పనిసరిగా తెలుసుకోవాలని సూచించారు. పిల్లలు ఇంటి నుంచి వెళ్లిపోయినా, తప్పిపోయినా 24 గంటల్లోగా స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. జిల్లా బాలల రక్షణ విభాగాధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ బాలబాలికలు తమకు ఆపద ఎదురైన సమయంలో ఉచిత హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 112, 181కు ఫోన్ చేయాలని సూచించారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌ఏఎఫ్ సంస్థ న్యాయవాది నాగలక్ష్మి, సిబ్బంది, వార్డెన్లు పాల్గొన్నారు.

జూదరులపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: బ్రాడీపేట 1/13లోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు ఆదివారం దాడి చేశారు. పది మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.77,300 స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మిర్చి యార్డ్ డైరెక్టర్ ఇంద్ర ప్రమాణ స్వీకారానికి భారీ ర్యాలీ



గుంటూరు రూరల్: గుంటూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా మండలంలోని చిన్నపలకలూరు గ్రామానికి చెందిన బొందలపాటి వెంకటేశ్వరరావు(ఇంద్ర) ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం సందడిగా జరిగింది. ఈ సందర్భంగా చిన్నపలకలూరు గ్రామం నుంచి ద్విచక్ర వాహనాల, కార్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. తొలుత చిన్న పలకలూరు పోలేరమ్మ ఆలయంలో ఇంద్ర ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ర్యాలీని జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు, స్థానిక వైఎస్సార్ సీపీ నేతలు ప్రారంభించారు. గ్రామం నుంచి బయలుదేరిన ర్యాలీ పెదపలకలూరు మీదుగా నగరం నుంచి మిర్చియార్డుకు చేరుకుంది. అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నూతనంగా పదవీ ప్రమాణం చేసిన ఇంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకంతో వ్యవసాయ మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌గా పదవిని అందించిన స్థానిక ఎమ్మెల్యే మేకతోటి సుచరితకు, మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరంలో 250 మందికి పరీక్షలు



శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని

నెహ్రూనగర్: కృష్ణ బలిజ సంఘం ఆధ్వర్యంలో కోస్టల్ కేర్ హాస్పిటల్స్, కొమ్మినేని డెంటల్, కాస్మోటిక్స్ హాస్పిటల్స్ సంయుక్త సౌజన్యంతో ఆదివారం అంబేడ్కర్ నగర్‌లోని కృష్ణ బలిజ సంఘ కమ్యూనిటీ హాలు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌కుమార్ తెలిపారు. శిబిరంలో 250 మందికి ఉచితంగా వైద్యసేవలతో పాటు మందులు అందజేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణ బలిజ కార్పొరేషన్ చైర్మన్ కోలా భవాని మాట్లాడుతూ ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహించి, పేద ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు నూరీ ఫాతిమా, నూర్, సంఘ నాయకులు బత్తుల శంకర్, వీసం వాసు, అన్నం జానుకులు, మువ్వా రాము, బత్తుల ప్రసాద్, అన్నం నాగేశ్వరరావు, నాగరాజు, కోలా మణికంఠ, నారాయణ పాల్గొన్నారు.

ఎండ్రోక్రైనాల్జిపై ప్రజలకు అవగాహన కల్పించాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్



మాట్లాడుతున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ లావణ్య కటకం

గుంటూరు మెడికల్: ఎండ్రోక్రైనాల్జిపై గ్రామీణ ప్రాంతాల్లో అంతంతమాత్రమే అవగాహన ఉందని, అక్కడ ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ తెలిపారు. గుంటూరు వెల్‌కమ్ హోటల్‌లో ఆదివారం ఎండ్రోక్రైనాల్జి వైద్యులు రాష్ట్ర సదస్సు నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ నేడు పలువురు షుగర్ వ్యాధి బారిన పడుతున్నారన్నారు. అది వస్తే హార్ట్ ఎటాక్ మొదటి దశ మొదలైనట్లు గుర్తించాలని తెలిపారు. థైరాయిడ్, షుగర్ వ్యాధుల బారిన పడకుండా ఎండ్రోక్రైనాల్జి వైద్యులు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ రెండు వ్యాధుల నియంత్రణలో ఎండ్రోక్రైనాల్జి పాత్ర కీలకమని పేర్కొన్నారు. రాష్ట్ర సదస్సు కన్వీనర్ డాక్టర్ లావణ్య కటకం మాట్లాడుతూ థైరాయిడ్, డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వ్యాధుల నిర్ధారణ, ఆధునిక వైద్య పద్ధతులపై యువ వైద్యులకు అవగాహన కల్పించేందుకు రాష్ట్ర సదస్సు ఏర్పాటు చేశామని వివరించారు. సదస్సుకు గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాల్జిస్ట్ డాక్టర్ షేక్ నాగూర్ బాషా పరిశీలకులుగా వ్యవహరించారు. ఐఎంఏ నాయకులు డాక్టర్ గార్లపాటి నందకిశోర్, డాక్టర్ కొంగర శ్రీకాంత్, డాక్టర్ ఎంఈ రామ్మోహన్, డాక్టర్ వంశీకృష్ణ, డాక్టర్ మైథిలి, డాక్టర్ పద్మలత పాల్గొన్నారు.

పీఎస్‌ఎల్వీ సీ-56 ప్రయోగ విజయంపై హర్షం

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీహరికోట నుంచి ఇస్రో ప్రయోగించిన పీఎస్‌ఎల్వీ సీ–56 విజయంపై చిల్డ్రన్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా నిర్వాహకుడు జి. శాంతమూర్తి ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సింగపూర్‌కు చెందిన డీఎస్‌ఎస్‌ఏఆర్ ఉపగ్రహంతో పాటు మరో ఆరు నానో ఉపగ్రహాల్ని ఇస్రో విజయవంతంగా అంతరిక్షంలోకి ప్రవేశపెట్టిందని తెలిపారు.

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులు అమానుషం



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు



ట్రినిటీ ప్యారిష్ చర్చి ఆధ్వర్యంలో జరిగిన ర్యాలీలో పాల్గొన్న పాస్టర్లు, క్రైస్తవులు

నెహ్రూనగర్: మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడుల్ని అరికట్టి, దోషుల్ని కఠినంగా శిక్షించాలని, యూసీసీని విరమించుకోవాలని ఐక్య (ఆల్ ఇండియా క్రిస్టియన్ యూత్ ఆర్గనైజేషన్) వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ గొల్లమూడి రాజ సుందరబాబు డిమాండ్ చేశారు. నగరంలోని చర్చిలు, మినిస్ట్రీలు, పాస్టర్ల అసోసియేషన్ల భాగస్వామ్యంతో ఆదివారం ఏసీ కాలేజీ నుంచి లాడ్జి సెంటర్ వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లౌకిక రాజ్యాంగంగా పేరుగాంచిన భారతదేశంలో మణిపూర్ రాష్ట్రంలో క్రైస్తవులపై దాడులు బాధాకరమని ఖండించారు. మణిపూర్ ఘటనకు ప్రధాన మోడీ బాధ్యత వహించాలన్నారు.యూసీసీకి వ్యతిరేకంగా ఆగస్టు 8న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద, దళిత ప్రజా సంఘాల నాయకులతో ధర్నా నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ధర్నా అనంతరం మణిపూర్‌లో పర్యటించి అక్కడ జరుగుతున్న అన్యాయాలపై నివేదిక రూపొందించి సుప్రీం కోర్టు జడ్జికి అందజేస్తామని తెలిపారు. దీంతో పాటు యూఎన్‌ఓకి కూడా ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో క్రైస్తవ విశ్వాసులు బాబూరావు, పేరుపోగు సురేష్ జేమ్స్, మద్దు జాన్సన్, రమేష్, మరియదాసు, బండ్లమూడి స్టాలిన్ బాబు, నల్లపు నీలాంబరం, విజయ భాస్కర్, తిప్పాబత్తిన గోవిందు, స్వప్న , విజయమ్మ, విలియమ్స్ పాల్గొన్నారు.


మణిపూర్‌లో శాంతి కోరుతూ ర్యాలీ

పాత గుంటూరు: మణిపూర్‌లో హింసాత్మక దాడుల్ని అరికట్టి, శాంతిని నెలకొల్పాలని కోరుతూ ఆదివారం ట్రినిటీ ప్యారిష్ చర్చి ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. సంఘ కాపరి రెవరెండ్ జె. దైవాశీర్వాదం మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులపై దాడుల్ని తక్షణమే ఆపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.అక్కడ శాంతి నెలకొనాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. అనంతరం దియాకోనల్ మినిస్ట్రీలోని హెచ్ఐవి పిల్లలకు పోషక ఆహార పదార్థాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెవరెండ్ వి. క్రిష్టోఫర్, గ్రేసు సుదర్శనం, భీమరాజు, బి. లెనిన్, బి. విల్సన్‌రాజు, టి. రాజేష్ , పలువురు క్రైస్తవులు పాల్గొన్నారు.

తెలుగు బాప్టిస్టు సంఘం ఆధ్వర్యంలో...

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడుల్ని అరికట్టి, శాంతిని నెలకొల్పాలని గుంటూరు తెలుగు బాప్టిస్టు సంఘం కాపరులు రెవరెండ్ ఎం. గాబ్రియేలు, అత్తోట జోసఫ్ కుమార్ కోరారు. కన్నావారితోటలోని మూడు బొమ్మల సెంటర్‌లో గుంటూరు తెలుగు బాప్టిస్టు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మణిపూర్‌లో దాడులు, చర్చిలపై విధ్వంసాల్ని నిరసిస్తూ, క్రైస్తవ బాధితులకు మానవహారంగా సంఘీభావం తెలిపారు. ఆరాధన అనంతరం ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో అసోసియేట్ పాస్టర్ టి. ఈనక్ జార్జి, కార్యదర్శి కె. ప్రియతమ్, సహాయ కార్యదర్శి టి. పాల్‌రాజ్, స్టాండింగ్ కమిటీ చైర్మన్ పినపాటి నానారావు, స్త్రీల సమాజం పాల్గొన్నారు.

వీనుల విందుగా 'ఏ షామ్ మస్తానీ'



పాటలు ఆలపిస్తున్న గాయకులు

పాత గుంటూరు: రాజాగారితోటలోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్, గీతాంజలి ఆర్కెస్ట్రా సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఏ షామ్ మస్తాని–14 పేరుతో సినీ సంగీత విభావరి వీనుల విందుగా సాగింది. ప్రత్యేక గాయని శ్రీ లలిత (పాడుతా తీయగా) పాడిన కాంతారా చిత్రంలోని వరాహ రూపం పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గాయకులు అమ్మపండు, పూజ, సునంద, శరణ్య, నందిని, హేమమాలిని, సింహ, కల్యాణ్, విజయ్‌సాయి, వెంకటేశ్వరరావు, రాజేంద్ర సినీ పాటల్ని ఆలపించి ప్రేక్షకుల్ని అలరించారు. వాయిద్య సహకారాన్ని అశోక్, రఫీ, కన్నా, బాలశౌరి, రవి, ఈశ్వర్, ప్రసాద్, శ్రీకాంత్, హనుమ అందించారు. కామెడీ కింగ్ శివ మిమిక్రీ ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు, ఎస్.వి.ఎస్. లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గీతాంజలి ఆర్కెస్ట్రా అమ్మపండు పర్యవేక్షించారు.

బండి సాహితీరెడ్డి ట్రస్టు సేవలు అభినందనీయం

జెడ్పీ చైర్‌పర్సన్ హెన్రీ క్రిస్టినా



గుంటూరు రూరల్: సాహితీరెడ్డి ట్రస్టు ఏర్పాటు చేసి, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అశోక్‌రెడ్డి, సుధావాణి దంపతుల సేవలు అభినందనీయమని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెన్రీ క్రిస్టినా పేర్కొన్నారు. జొన్నలగడ్డ గ్రామంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ ఆవరణలో ఆదివారం బండి సాహితీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సాహితీరెడ్డి 34వ జయంతి సందర్భంగా 100 మంది పేద విద్యార్థినులకు రూ.5000 చొప్పున రూ.5లక్షల ఉపకార వేతనాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్‌పర్సన్ పాల్గొని, మాట్లాడారు. లక్ష్య సాధనకు విద్యార్థులు కృషి చేయాలని సూచించారు. మచిలీపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ మేకతోటి దయాసాగర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరుప్రతిష్టలు తీసుకురావాలని తెలిపారు. ఉపాధ్యాయ శాసన మండలి సభ్యురాలు టి.కల్పలతారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, వ్యాపారవేత్త బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి, రెడ్డి బాలుర వసతి గృహం అధ్యక్షుడు చల్లా అంజిరెడ్డి, సత్యనారాయణరెడ్డి, జొన్నలగడ్డ సర్పంచ్ ఎం. శిరీష, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీఏఎస్ కళాశాల ప్రొఫెసర్‌కు డాక్టరేట్



పెదనందిపాడు : స్థానిక ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ గుర్రం వీర రాఘవయ్యకు కర్నూలులోని రాయలసీమ విశ్వవిద్యాలయం కంప్యూటర్ సైన్సులో డాక్టరేట్ ప్రదానం చేసింది. ఈ సందర్భంగా రాఘవయ్య మాట్లాడుతూ నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ రామినేని శివరామ ప్రసాద్ పర్యవేక్షణలో 'క్వాంటం కీ డిస్ట్రిబ్యూషన్ , వెరిఫైబుల్ – ట్రేసబుల్ సైఫర్ టెక్స్ట్ పాలసీ ఏ ట్రిబ్యూట్ బేస్డ్ ఎన్‌స్క్రిప్షన్, సెక్యూరిటీ మోడల్ ఫర్ ట్రెజరి ఇన్‌ఫర్మేషన్ సిస్టం' అనే అంశం మీద పరిశోధకు పీహెచ్‌డీ పట్టా పొందినట్లు తెలిపారు.